సాక్షి
వికారాబాద్

బుధవారం, 17, మే, 2023



సీఎం కప్.. అంతా గప్‌చుప్
గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ ఆటలపోటీల్లో కనీస వసతులు కరువయ్యాయి. 8లో▸



పరిహారం రాదాయె..
రోడ్డు కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం ఇవ్వకుండా సర్కారు పరిహాసం చేస్తోంది. 8లో▸



నిఘా నీడలో తాండూరు
శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా తాండూరు పట్టణంలో సీసీ కెమెరాలు బిగిస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

నేడు ఇంటర్వ్యూలు

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు బిగ్ బాస్కెట్ హైదరాబాద్‌లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హతల జిరాక్స్ పత్రాలతో బుధవారం ఉదయం 10 గంటలకు వికారాబాద్‌లోని డీపీఆర్సీ భవన్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 7330924112, 9866336518లో సంప్రదించాలని సూచించారు.

22నుంచి సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు

వికారాబాద్ అర్బన్: ముఖ్యమంత్రి కప్ క్రీడాపోటీల్లో మండల స్థాయిలో గెలుపొందిన జట్లు ఈ నెల 22 నుంచి 24 వరకు నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనాలని యువజన క్రీడల అధికారి హన్మంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న ఉదయం 9గంటల లోపు ఆధార్ కార్డు వివరాలతో జిల్లా కేంద్రంలోని బ్లాక్ గ్రౌండ్‌కు రావాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో జరగబోయే క్రీడల్లో పాల్గొనాలనుకునే వారు కూడా ఈనెల 19లోపు పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. వివరాలకు 9676638201లో సంప్రదించాలని సూచించారు.

సొంత పనులకు పంచాయతీ ట్రాక్టర్లు



గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ట్రాలీలో లోడ్ చేసిన వరి పైరు

దోమ: గ్రామ పంచాయతీ ట్రాక్టర్లను కొంత మంది ప్రజాప్రతినిధులు తమ సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. పలుగుతండాకు ప్రభుత్వం అందజేసిన ట్రాక్టర్‌ను సర్పంచ్ నీలిబాయి పంచాయతీ పనులకు కాకుండా సొంత పనులకు వినియోగిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. తన పొలంలో కోసిన వరి పైరును పంచాయతీ ట్రాక్టర్ ద్వారా తరలించాలని తెలిపారు. ఈ విషయమై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేపటి నుంచి పారిశుద్ధ్య కార్యక్రమాలు

కలెక్టర్ నారాయణరెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 17నుంచి 23 వరకు అన్ని గ్రామాల్లో పనులు చేపట్టాలన్నారు. ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు పర్యవేక్షించాలని సూచించారు. సీఎం కప్ టోర్నమెంట్‌కు వచ్చే క్రీడాకారులకు అన్ని సదుపాయాలు కల్పించాలని తెలిపారు. మండల స్థాయిలో 11 రకాల ఆటల పోటీల్లో గెలుపొందిన క్రీడాకారుల వివరాలను బుధవారం వరకు జిల్లా యువజన క్రీడల అధికారికి అందజేయాలన్నారు. ధాన్యం సేకరణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత తహసీల్దార్లదేనని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఆర్‌ఓ అశోక్‌కుమార్, డీఆర్‌డీఓ కృష్ణన్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుభాషిణి, డీపీఓ తరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు సుందరీకరణకు రూ.25 కోట్లు

తాండూరు: పట్టణంలోని ప్రధాన రోడ్డు సుందరీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రోడ్డు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి విజయేంద్రబోయి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది జాతీయ రహదారి పనుల్లో భాగంగా పట్టణంలోని రసూల్‌పూర నుంచి గౌతాపూర్ వరకు రోడ్డు విస్తరణ పనులకు రూ.23 కోట్లు మంజూరయ్యాయి. దీంతో ప్రస్తుతం ఇవి తుది దశకు చేరుకున్నాయి. ఇదిలా ఉండగా అంబేడ్కర్ చౌక్ నుంచి సెయింట్ మార్క్స్ స్కూల్ వరకు రోడ్డును మరింత అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి భావించారు. ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రి ప్రశాంత్‌రెడ్డిని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన వారు ఒకే విడతలో రూ.25 కోట్లు మంజూరు చేస్తూ జీఓ నంబర్ 217ను జారీ చేశారు.



పూల ‘దారి’

పెద్దేముల్ మండలం నుంచి వెళ్లే తాండూరు– సంగారెడ్డి ప్రధాన రోడ్డు పూలదారిగా మారింది. రహదారికి ఇరువైపులా అల్లుకున్న పూల చెట్లు ప్రయాణికులు, వాహనదారులకు నీడతో పాటు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఈ రూట్లో సంగారెడ్డి, వికారాబాద్, జహీరాబాద్, కోట్‌పల్లి, బంట్వారం, నాగులపల్లి, అడ్కిచెర్ల వెళ్లే ప్రయాణికులు పూల దారిని చూసి సంతోషం వ్యక్తంచేస్తున్నారు. వాహనాలు ఆపి సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటున్నారు.

– పెద్దేముల్

‘ఎల్‌ఆర్‌ఎస్’ పరిశీలన



పరిగి పట్టణ శివారులోని లేఅవుట్

ప్రభుత్వ సూచనతో మళ్లీ కదలిక

- 2020లో దరఖాస్తుల స్వీకరణ
- కోర్టు ఆదేశాలతో ఆగిన ప్రక్రియ
- మున్సిపల్ శాఖ నిర్ణయంతో ఇటీవలే ముందడుగు
- క్షేత్రస్థాయి పరిశీలనలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం

మున్సిపాలిటీ	దరఖాస్తులు
తాండూరు	4,400
వికారాబాద్	4,200
పరిగి	4,178
కొడంగల్	406

పరిగి: ఎల్‌ఆర్‌ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)లో భాగంగా వచ్చిన దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన కొనసాగుతోంది. మున్సిపాలిటీల్లోని అనధికారిక ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ కింద 2020లో దరఖాస్తులు స్వీకరించింది. ఒక్కో అప్లికేషన్‌కు రూ.వెయ్యి చొప్పున ఫీజు వసూలు చేయగా, కోర్టు ఆదేశాలతో వీటి పరిశీలన నిలిచిపోయింది. దీంతో మున్సిపల్ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పక్కన పెట్టేశారు. తాజాగా దరఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం, మున్సిపల్ శాఖ ఆదేశాలు జారీ చేయడంతో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో ప్రక్రియ ప్రారంభమైంది. ఎల్‌ఆర్‌ఎస్‌కు మొత్తం 13,148 దరఖాస్తులు వచ్చాయి.

సిబ్బంది కొరత

తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అవసరమైన టౌన్ ప్లానింగ్ సిబ్బంది లేరు. అన్నిచోట్లా ఇన్‌చార్జ్‌లతోనే పనులు చేయిస్తున్నారు. వీరు రెండు, మూడు మున్సిపాలిటీల బాధ్యతలు చూస్తుండటంతో వారంలో రెండు రోజులు మాత్రమే ఒక చోట అందుబాటులో ఉంటున్నారు. పురపాలక శాఖ అధికారుల ఆదేశాలతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనతో పాటు, అవసరమైన వాటికి అనుమతులు ఇస్తున్నారు. ఇందుకోసం ఎల్‌ఆర్‌ఎస్‌కు రావాల్సిన డబ్బులను ఫీజు రూపంలో తీసుకుంటూ ఇంటి నిర్మాణం, రిజిస్ట్రేషన్, అమ్మకాలు చేపట్టేందుకు పర్మిషన్ ఇస్తున్నారు. మున్సిపాలిటీల్లో టౌన్ ప్లానింగ్ సిబ్బంది కొరతతో పనులు ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన సిబ్బంది లేక ఇబ్బందిగా మారుతోంది.

సుప్రీంలో పెండింగ్

ఎల్‌ఆర్‌ఎస్‌పై సుప్రీం కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. కానీ మున్సిపల్ శాఖ అధికారులు ఇచ్చిన ఆదేశాలతో అప్లికేషన్ల పరిశీలన కొనసాగుతోంది. సుప్రీం కోర్టు నుంచి వెలువడిన ఆదేశాలకు కట్టుబడి షరతులతో కూడిన ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్ కాపీ మాత్రమే జారీ చేస్తారనే ప్రచారం సాగుతోంది. అధికారులు మాత్రం 2020లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఒకసారి పరిశీలించి, వాటికి సంబంధించిన వివరాలను సిద్ధం చేస్తున్నామని చెబుతున్నారు.

టీపీఓలదే బాధ్యత

మున్సిపాలిటీల్లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన అప్లికేషన్ల పరిశీలన బాధ్యత మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులదే. దరఖాస్తులకు అనుమతులు ఇవ్వాలంటే మూడు విభాగాలు ఉంటాయి. ఇందులో మొదటి విభాగంలో టీపీబీఓలు ఎల్‌ఆర్‌ఎస్‌కు వచ్చిన ప్రతీ దరఖాస్తుకు సంబంధించి క్షేత్రస్థాయికి వెళ్లి స్థలాన్ని చూశాకే నిర్ణయం తీసుకుంటారు. గ్రీన్ జోన్, చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు వంటివి ఉన్న స్థలాల్లో ప్లాట్లు ఏర్పాటు చేశారా అనేది స్పష్టంగా తెలియజేయాలి. ఆతర్వాత వీటిని రెండో విభాగం అంటే.. టీపీఎస్, టీపీఓలు సరిచూసుకుని ఓకే చేస్తే మూడో విభాగానికి వెళ్తుంది. మొదటి, రెండో విభాగాల్లో ఆమోదం పొందిన వాటికి మూడో విభాగంలో మున్సిపల్ కమిషనర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి. నిబంధనలకు లోబడి ప్లాట్లు ఉంటే కొలతలు, రిజిస్ట్రేషన్ సమయంలో మార్కెట్ విలువ తదితర అంశాలను పరిశీలిస్తారు.

ఆన్‌లైన్ చేస్తున్నాం



2020లో చేసుకున్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలిస్తున్నాం. ఇప్పటికే ప్రక్రియ ప్రారంభమైంది. లేఅవుట్లు ప్రభుత్వ స్థలాల్లో ఉన్నాయా..? అని క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నాం. ఎల్– 1, ఎల్– 2 విభాగాలు క్షేత్రస్థాయిలోని ఫొటోలతో కూడిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నాం.

– శరభలింగం, ఇన్‌చార్జ్ టౌన్ ప్లానింగ్ అధికారి, పరిగి

విపత్తులో విత్తు

- మార్కెట్లో నకిలీ సీడ్స్ దడ
- వానాకాలం నేపథ్యంలో అక్రమార్కుల దందా
- బ్రాండెడ్ కంపెనీల పేరుతో మోసం
- అప్రమత్తంగా లేకపోతే అంతే సంగతులు

కొడంగల్: వానాకాలం సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో నాసిరకం విత్తనాలు మార్కెట్‌కు చేరుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఏటా ఈ దందా నిర్వహించే అక్రమార్కులు ఎప్పటిలాగే తమ పని ముమ్మరం చేశారని తెలుస్తోంది. కొద్ది రోజుల్లో రోహిణీ కార్తె ప్రవేశించనుంది. ఈ నెల 25నుంచి వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కురిసిన అకాల వర్షాలకు రైతులంతా దుక్కులు దున్ని విత్తనాలు నాటేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇదే అదనుగా కర్షకులకు నాసిరకం సీడ్స్ అంటగట్టేందుకు కొంతమంది దళారులు, వ్యాపారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని రైతులు మోసపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

కర్ణాటక కేంద్రంగా దందా

కొడంగల్ నియోజకవర్గ సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రం నుంచి నకిలీ విత్తనాల దందా జోరుగా సాగుతోంది. బ్రాండెడ్ కంపెనీలకు చెందిన కవర్లను తయారు చేయించి వాటిలో నాసిరకం విత్తనాలు నింపి ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. ఈ వ్యవహారాలన్నీ తెలియని రైతులు నిండా మునుగుతున్నారు. కొడంగల్ శివారులోని కర్ణాటక శివారు గ్రామాలు ఇందుకు వేదికగా మారుతున్నాయి. హైదరాబాద్– బీజాపూర్ జాతీయ రహదారిపై కొడంగల్‌కు 45 కిలోమీటర్ల దూరంలో గుర్మిట్కల్ పట్టణం ఉంది. గుర్మిట్కల్‌లోని ఒక ఎరువుల దుకాణం యజమాని నకిలీ విత్తనాల దందా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అతను కర్ణాటక రాష్ట్రంలోని కుప్పిగిరి జిల్లాలో ఉన్న జిన్నింగ్ మిల్లు నుంచి పత్తి విత్తనాలు సేకరించి వాటికి రంగులు కలిపి బ్రాండెడ్ కంపెనీల పేర్లతో ముద్రించిన కవర్లలో ప్యాకింగ్ చేసి గ్రామాలకు సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అతను హైదరాబాద్‌లోని ఒక ప్యాకింగ్ కంపెనీలో బ్రాండెడ్ కంపెనీల కవర్లను కొనుగోలు చేసి వీటిలో నాసిరకం విత్తనాలు నింపి.. తమకు అనుకూలంగా, నమ్మకంగా ఉండే వ్యాపారులు, దుకాణాదారులకు సరఫరా చేస్తున్నారు. కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లోని పలు గ్రామాల్లో ఇందుకోసం ప్రత్యేక ఏజెంట్లు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

గతం నుంచి నకిలీ దందానే

కొడంగల్ మండల పరిధిలోని అన్నారం గ్రామంలో గత ఏడాది ఓ ఇంట్లో తనిఖీలు నిర్వహించిన పోలీసులు నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. 320 కిలోల నకిలీ పత్తి విత్తనాలు (లూజు), బ్రాండెడ్ కంపెనీల పేరుతో ముద్రించిన 60 ప్యాకెట్లు, వివిధ కంపెనీల పేరుతో తయారు చేయించిన 290 పోర్లరీ కవర్లు, విత్తనాలు కొలిచే డబ్బా దొరికింది. అదే రోజు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించి రిమాండ్‌కు తరలించారు. వీరిచ్చిన సమాచారంతో పోలీసులు తీగలాగగా.. డొంక కదిలింది. పోలీసులు నిఘా పెంచడంతో సూత్రధారులు, పాత్రధారులు పట్టుబడ్డారు. కొంత కాలానికి రిమాండ్‌పై బయటకు వచ్చిన వీరు తిరిగి ఇదే దందా నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నకిలీ వ్యవహారంపై ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. రైతులను నష్టపరిచే కల్తీ, నకిలీ, నిషేధిత సరుకులను విక్రయించినా.. అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. పది రోజుల్లో వానాకాలం సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన విత్తనాలనే వాడాలని చెబుతున్నారు.



గతేడాది వానాకాలం సీజన్‌లో కొడంగల్ వద్ద పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు

రైతు కష్టం వృథా కావద్దు

- నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించండి
- నకిలీలపై తనిఖీలు ముమ్మరం చేయండి
- కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం

వికారాబాద్ అర్బన్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, డీజీపీ అంజనీకుమార్ మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. విత్తనాలు బాగా లేకపోతే రైతులు పడే ఆరు నెలల కష్టానికి ఫలితం ఉండదని తెలిపారు. రైతులు నష్టపోకుండా వ్యవసాయ అధికారులు 15 రోజుల పాటు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని ఆదేశించారు. పోలీసు శాఖ సహకారంతో విత్తన షాపులలో తనిఖీలు చేపట్టాలన్నారు. అన్ని క్లస్టర్లలోని రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించి నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఏఓలు, ఏఈఓలు, టాస్క్‌ఫోర్స్ బృందాలు క్షేత్ర స్థాయిలో రైతుల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవాలన్నారు. తనిఖీల సమయంలో డీలర్లను ఇబ్బంది పెట్టవద్దని అధికారులకు సూచించారు. వానాకాలం పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ విషయంలో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ ఫిర్యాదుల ఆధారంగా వారి సహకారంతో నకిలీ విత్తనాలు విక్రయించకుండా ముమ్మర తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, హార్టికల్చర్ అధికారి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, చిత్రంలో ఎస్పీ కోటిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

‘లక్ష్మీదేవిపల్లి’పై అనవసర రాద్ధాంతం

- పురోగతిలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు
- భట్టి.. వట్టి మాటలు కట్టిపెట్టు
- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఫైర్

షాద్‌నగర్: ‘పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా నిర్మించే లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పురోగతిలో ఉంది.. దీనిపై ప్రతి పక్షాలు అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నాయి.. ప్రాజెక్టుపై ఏమాత్రం అవగాహన లేని భట్టి విక్రమార్కవి అన్నీ వట్టి మాటలే’ అంటూ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మండిపడ్డారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాగు, సాగు నీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్ దూరదృష్టితో ఆలోచించి ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ప్రాజెక్టు పనులు ప్రస్తుతం జడ్చర్ల పరిధిలోని ఉద్దండాపూర్ వద్ద కొనసాగుతున్నాయని, అక్కడ పూర్తి కాగానే రెండోదశలో లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు విషయమై సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. గతంలో ఈ ప్రాజెక్టు నిర్మించొద్దని నల్లజెండాలు పట్టుకొని ఆందోళనలు చేపట్టడమే కాకుండా సర్వే పనులను అడ్డుకోవడంతోపాటు గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు వేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. నాడు ప్రాజెక్టు పనులను అడ్డుకొని నేడు ప్రాజెక్టు నిర్మించాలని స్వార్థ రాజకీయాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పోతిరెడ్డి ద్వారా కృష్ణా జలాలను రాయలసీమ ప్రాంతానికి తరలించుకుపోతే ఆ పార్టీ నేతలు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా,ప్రతిపక్షంలో మరో విధంగా వ్యవహరించడం తగదని ఎమ్మెల్యే హితవు పలికారు. ప్రాజెక్టు పురోగతి పనులు చూసేందుకు వస్తామంటే తీసుకెళ్లేందుకు తాము సిద్ధమని స్పష్టం చేశారు. ప్రజలను అయోమయానికి గురిచేసేలా తప్పుడు ప్రచారాలు చేయడం తగదన్నారు. సమావేశంలో రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ ప్రకాశ్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒక్కో గ్రూపులో 40 సీట్లు ఉంటాయని.. కేవలం ఇంగ్లిష్ మీడియం మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. టెన్త్ పాసైన వారు ఈనెల 25లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అన్ని జ్వరాలు డెంగీ కాదు

- ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- డీఎంహెచ్‌ఓ పాల్వన్ కుమార్
- వికారాబాద్‌లో అవగాహన ర్యాలీ

వికారాబాద్ అర్బన్: డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పాల్వన్ కుమార్ సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని జ్వరాలు డెంగీ కాదన్నారు. కొందరు వైద్యులు ఒకసారి రక్త పరీక్ష చేసి డెంగీ జ్వరం ఉందని చెబితే నమ్మవద్దని తెలిపారు. డెంగీ జ్వరం నిర్ధారణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ ల్యాబ్‌లోనే టెస్టులు చేయించాలని సూచించారు. స్థానికంగా ఉండే ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, పీహెచ్‌సీల్లో రక్త నమూనాలు ఇచ్చి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అనవసరమైన ఆందోళనకు గురికావద్దన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చుట్టు పక్కల దోమల నివాసం లేకుండా జాగ్రత్త పడితే డెంగీ దరి చేరదన్నారు. అనంతరం ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు, సూపర్ వైజర్లకు డెంగీ, మలేరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవరాజ్, డాక్టర్ అర్వింద్, డాక్టర్ నిఖిల పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ పాల్వన్ కుమార్

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తాండూరు రూరల్: మండల పరిధిలోని గోనూరు గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన కట్టల సురేశ్ తన ట్రాక్టర్‌లో మంగళవారం వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా కరణ్‌కోట పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి ఈ సందర్భంగా హెచ్చరించారు.

సాకేత్‌నగర్ కాలనీలో చోరీ

అనంతగిరి: వికారాబాద్ పట్టణం సాకేత్‌నగర్ కాలనీలోని ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన విశ్వనాథ్ తన కుటుంబం అంతా ఈనెల 14న బంధువుల పెళ్లికి ఇంటికి తాళం వేసి వెళ్లారు. అదే రోజు రాత్రి ఇంట్లో దొంగలు పడ్డారు. ఉదయం పక్కింటి వారు గమనించి విశ్వనాథ్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా ఇంటి తాళం విరగ్గొట్టి ఉంది. బీరువాను ధ్వంసం చేసి నాలుగు తులాల బంగారు నగలు, పలు వెండి వస్తువులు, కొంత నగదును అపహరించారు. విషయం పోలీసులకు తెలియగానే ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శీను తెలిపారు.

పంటకోత ప్రయోగాలతో మేలు


పాలేపల్లిలో వరి కోత ప్రయోగాన్ని చేపడుతున్న గణాంకాల అధికారి సందీప్‌రెడ్డి

దోమ: పంటకోత ప్రయోగాలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయ మండల గణాంకాల అధికారి సందీప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పాలేపల్లిలో రాజు అనే రైతు పొలంలో వరి కోత ప్రయోగాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులను పొందాలన్నారు. సమయానుకూలంగా పంటలను సాగు చేస్తూ అధికారులు సూచించే విత్తనాలు, ఎరువులను వాడుతూ లాభాలను ఆర్జించాలన్నారు. పాలేపల్లిలోని వరి పొలంలో ఐదు మీటర్ల వెడల్పు, ఐదు మీటర్ల పొడవులో పంట కోతప్రయోగాలు చేయగా, 21.085 కిలోలు వచ్చిందన్నారు. ఎకరానికి 22 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు. ప్రతి రైతు పంట కోత ప్రయోగాలను చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కారు దగ్ధం

షాద్‌నగర్: మున్సిపల్ పరిధిలోని రాంనగర్ కాలనీలో షార్ట్ సర్క్యూట్‌తో కారు కాలిపోయింది. కొందుర్గుకు చెందిన నగేష్‌కు కారు ఉంది. దీన్ని ఆయన అద్దెకు నడుపుతున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి ముందు నిలిపిన కారును స్టార్ట్ చేసేందుకు యత్నించగా ఒక్కసారిగా పొగలతో మంటలు వ్యాపించాయి. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సీఎం కప్.. అంతా గప్‌చుప్


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు(ఫైల్)

క్రీడలపై కానరాని ఆసక్తి
- లోపించిన ప్రచారం
- విడుదల కాని నిధులు
- గ్రామాల నుంచి రాని ఎంట్రీలు
- పట్టించుకోని అధికారులు

దౌల్తాబాద్: మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సీఎం కప్ క్రీడాపోటీలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా సోమవారం నుంచి మూడు రోజుల పాటు మండల స్థాయిలో నిర్వహించాలని ఆదేశాలు ఉన్నాయి. అయితే క్రీడా పోటీలను మండలంలో ఇంకా ప్రారంభించలేదు. ఈ క్రీడాపోటీల్లో పాల్గొనడానికి మండలంలో అంతగా ఆసక్తి చూపడంలేదు. మండల స్థాయిలో అధికారులు ప్రచారం నిర్వహించినా గ్రామీణ క్రీడాకారుల నుంచి ఆశించిన ఫలితం కనిపించడంలేదు.

ప్రచారం చేసే వారేరి?

ఇన్ని రోజులు జేపీఎస్‌లు సమ్మెలో ఉండడం వల్ల గ్రామీణ స్థాయిలో ప్రచార లోపం కనిపిస్తోంది. అధికారులు గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం చేయలేదు. దీంతో అత్యంత ప్రజాదారణ కలిగిన గ్రామీణ క్రీడా కబడ్డీకే గ్రామల నుంచి జట్లు రావడంలేదు. ఇప్పటి వరకు మండలంలో కేవలం ఎనిమిది గ్రూపులు ఎంట్రీ అయినట్లు తెలిసింది. సోమవారం ప్రారంభించాల్సిన క్రీడాపోటీలకు బుధవారం చివరి రోజు ఒకే రోజు నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. గతంలో నిర్వహించిన సీఎం కప్ కోసం పోలీస్‌శాఖ నుంచి సహకారం వల్ల కొంతమేరకు యువతను సమాయత్తం చేసేవారు. ప్రస్తుతం పోలీస్ శాఖ ఎక్కడా నేరుగా కనిపించడంలేదు. యువతను సమాయత్తం చేయడంలో వెనుకంజ పడినట్లు పలువురు పేర్కొంటున్నారు.

విడుదల కాని నిధులు..

క్రీడా పోటీల నిర్వహణకు ప్రతి మండలానికి రూ.15వేలు కేటాయించారు. క్రీడల నిర్వహణ, మైదానాలను సిద్ధం చేయడం కొన్ని ఆట పరికరాలను కొనుగోలుకు ఈమొత్తం సరిపోదని విజ్ఞప్తులు రావడంతో మరో రూ.5వేలు పెంచినట్లు సమాచారం. ఇంత వరకు ఒక్క రూపాయి రాలేదని అధికారులు అంటున్నారు. తర్వాత డబ్బులు వస్తాయని ఈలోపు స్థానికంగా మీరే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించినట్లు తెలిసింది.



పైన కానుగ.. పయనం చల్లగా

- ఆటోవాలా ఆలోచన అదుర్స్

భానుడి భగభగలకు జనం అల్లాడుతున్నారు. గడపదాటి బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఓ ఆటా వాలా వినూత్నంగా ఆలోచించారు. చల్లదనాన్ని ఇచ్చే కానుగ ఆకులను ఆటోపై కప్పి ఉంచి ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నారు. మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తన ఆటోను హస్నాబాద్ నుంచి కొడంగల్‌కు నడిపిస్తున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమని పొందేందుకు ఆటో పై భాగాన కానుగ ఆకులను కడుతూ నడిపిస్తున్నారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రెండు రోజులకు ఓ పర్యాయం ఆకులను తీసివేస్తూ కొత్త ఆకులను కడుతున్నారు. ఎండాకాలం తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని, వడదెబ్బ తగలకుండా ఉండేందుకు డ్రైవర్ చేస్తున్న పనిని అందరూ మెచ్చుకుంటున్నారు.

– కొడంగల్ రూరల్

ఆకలికేకలతోనే ఆటలు


మండుటెండలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

కుల్కచర్ల: మండలంలో తూతూమంత్రంగా సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తున్నారు. మండుటెండల్లో క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులకు కనీసం భోజన సౌకర్యం కూడా కల్పించని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో దాతల సహాయంతో నెట్టుకొస్తున్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో నిర్వహించిన క్రీడాపోటీలలో క్రీడాకారులకు కనీసం భోజన సౌకర్యం, తాగేందుకు నీటికి కూడా ఏర్పాటు చేయలేదు. క్రీడల నిర్వహణకు అవసరమైన వాలీబాల్స్, నెట్‌లను సైతం తాత్కాలిక ప్రాతిపాదికన తెచ్చిన సందర్భం ఆశ్చర్యాన్ని కల్గిస్తోంది. ఇలాంటి దుస్థితిలో క్రీడల నిర్వహణ అవసరమా? అని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

భోజన సౌకర్యం లేక ఇబ్బందులు



ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడాపోటీల్లో భోజన సౌకర్యం లేదు. కనీసం స్నాక్స్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందిపడ్డాం. ఆకలితోనే క్రీడలు ఆడి ఇంటికి వెళ్తున్నాం. మండుతున్న ఎండల్లో తాగేందుకు నీళ్లు ఇచ్చే దిక్కులేదు.

– శ్రీను, క్రీడాకారుడు

నిధులు ఇవ్వకపోవడం దారుణం



క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నాం అని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం కనీసం సౌకర్యాలు కల్పించలేని దుస్థితిలో ఉంది. తన సొంత ఖర్చుతో కనీస సౌకర్యాలు కల్పించాం. నిధులు అందించి పెద్ద ఎత్తున క్రీడలు నిర్వహిస్తే బాగుండేది.

– శిరీషాలక్ష్మారెడ్డి, సర్పంచ్ బండవెల్కిచర్ల

నిధులు రావాల్సి ఉంది

మండలస్థాయిలో సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహించేందుకు నిధులు కేటాయించారు. విడుదల కావాల్సి ఉంది. నిధులు సమయానికి అందకపోవడం వల్ల కొంత ఇబ్బంది ఏర్పడింది. క్రీడాకారులకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటాం.

– నాగవేణి, ఎంపీడీఓ కుల్కచర్ల

‘ఉపాధి’ పనులను సద్వినియోగం చేసుకోండి


సయ్యద్‌పల్లిలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

పరిగి: ఉపాధిహామీ పథకంలో పేర్కొన్న అన్ని రకాల పనులు చేపట్టి సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ కృష్ణన్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని సయ్యద్‌పల్లిలో నర్సరీలను సందర్శించారు. అలాగే గ్రామం నుంచి పొలాలకు చేపడుతున్న మట్టి రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో పనులు చాలా బాగా జరుగుతున్నాయన్నారు. గ్రామం నుంచి పొలాలకు నక్షబాట ఉంటే ఉపాధిహామీలో రోడ్డు పనులను చేసుకోవచ్చని సూచించారు. వానాకాలం నాటికి హరితహారం కార్యక్రమానికి అన్ని రకాల మొక్కలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నిర్మూలన అందరి బాధ్యత



బంట్వారం: కోట్‌పల్లిలో అవగాహన ర్యాలీ

బంట్వారం: డెంగీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోట్‌పల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గీతిక పిలుపునిచ్చారు. డెంగీ నివారణ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం కోట్‌పల్లి మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. డెంగీ వ్యాప్తి చెందకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి చుట్టు పక్కల నీరు నిల్వకుండా చూడాలన్నారు. వారానికోసారి నీటి నిల్వలను తీసి వేయాలన్నారు. మురుగు కాల్వల్లో ఎప్పటికప్పుడు పారేలా చూడాలన్నారు. కూలర్లు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, డబ్బాలు, ప్లాస్టిక్ కప్పులు, పనికి రాని పాత్రలు ఇంటి పరిసరాల్లో ఉంటే కాల్చి వేయాలన్నారు. వారంలో రెండు రోజులు డ్రైడే పాటించాలని ఆమె ప్రజలకు సూచించారు. సూపర్‌వైజర్ శాంతకుమారి, ఏఎన్‌ఎంలు అంజలి, హేమలత, అపర్ణ, ప్రభావతి, నర్సమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


కొడంగల్ రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

దోమల నివారణకు కృషి చేయాలి

కొడంగల్ రూరల్: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ దోమల నివారణకు కృషిచేయాలని డాక్టర్ హరిప్రసాద్ అన్నారు. డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం అంగడి రాయిచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చెత్తా చెదారంతో దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యంగా ఉండేందుకు కృషిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ మహేందర్‌రాజ్, మధుసూదన్ రెడ్డి, మహేశ్, నవీన్, బిందురావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిహారం రాదాయె.. బెదిరింపులే దిక్కాయె

- ఆందోళనలో జీవన్గీ భూ నిర్వాసితులు
- ఏడాది గడిచినా ఖాతాల్లో జమకాని డబ్బులు


వంతెనకు వేస్తున్న అప్రోచ్ రోడ్డు (పక్కనే వరి పొలం)

బషీరాబాద్: రోడ్డు కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం ఇవ్వకుండా సర్కారు పరిహాసం చేస్తోంది. మండల పరిధిలోని జీవన్గీలో వంతెన అప్రోచ్ రోడ్డు కోసం ఏడాది కిందట భూ నిర్వాసిత రైతులకు అవార్డు లేఖలు (పరిహారం మంజూరు) ఇచ్చిన రెవెన్యూ అధికారులు నేటికీ వారి ఖాతాల్లో నిధులు జమచేయలేదు. పనులు దక్కించుకున్న గుత్తేదారు ఆదరాబాదరాగా రోడ్డు పనులు చేపట్టారు. పరిహారం అడిగిన రైతులను పోలీసు కేసులు పెడుతామని బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో 19 మంది భూ నిర్వాసిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బషీరాబాద్ మండలం జీవన్గీ వద్ద కాగ్నా నదిపై 2019లో రూ.6.36 కోట్లతో వంతెన నిర్మించారు. ఈ వంతెనకు ఇరువైపులా 3.5 కి.మీ. అప్రోచ్ రోడ్డు అవసరం ఉంది. చాలా కాలంగా భూసేకరణలో వచ్చిన ఇబ్బందులతో పనులు ప్రారంభంకాలేదు. అయితే 2020లో రెవెన్యూ అధికారులు 19 మంది రైతుల నుంచి 10 ఎకరాల భూమి సేకరించారు. ఈ భూములను ఆర్‌అండ్‌బీ అధికారులకు అప్పగించారు. 2022లో మేలో భూములు కోల్పోయిన రైతులకు తాండూరు ఆర్డీఓ అవార్డు లేఖలు అందజేశారు. అయితే ఏడాది గడిచినా సదరు నిర్వాసిత రైతులకు పరిహారం ఇవ్వకుండా ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు ప్రారంభించారు. మూడు రోజుల కిందట ఓ రైతు పరిహారం ఇవ్వకుండా పనులు ఎలా చేస్తారని అడ్డుకుంటే అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు బెదిరింపులకు పాల్పడ్డారని రైతులు తెలిపారు. అభివృద్ధి జరుగుతుంటే అడ్డుపడుతారా? ఎవరైనా పనులకు అడ్డుపడితే పోలీసు కేసులు పెడుతామని గ్రామస్తుల ఎదుట సదరు నేత హెచ్చరించడంతో భూనిర్వాసిత రైతులు భగ్గుమంటున్నారు. తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అడిగితే బెదిరింపులకు దిగుతారా? అని ప్రశ్నిస్తున్నారు.

కోర్టును ఆశ్రయిస్తాం



అప్రోచ్ రోడ్డు కోసం గ్రామానికి చెందిన 19 మంది రైతులం 10 ఎకరాల భూములు ప్రభుత్వానికి ఇచ్చాం. ప్రభుత్వం నుంచి రూ.కోటి పరిహారం రావాలి. ఇవ్వకుండానే రోడ్డు పనులు ప్రారంభించారు. పరిహారం అడిగితే బెదిరిస్తున్నారు. మాకు న్యాయం జరిగేవరకు పోరాడుతాం. దీని కోసం న్యాయవాదులతో మాట్లడుతున్నాం. కోర్టులో కేసు వేస్తాం.

– అంపిరెడ్డి, భూమి కోల్పోయిన రైతు

నాపరాతి వ్యర్థాలతో రోడ్డు పనులు


నాపరాతి వ్యర్థాలతో వేస్తున్న రోడ్డు

అప్రోచ్ రోడ్డు పనుల నాణ్యతలో డొల్లతనం కనిపిస్తోంది. రోడ్డుకు మొరం ఉపయోగించాల్సి ఉండగా గ్రామం సమీపంలో ఉన్న నాపరాతి గనుల్లో వ్యర్థాలను టిప్పర్ల ద్వారా తరలించి రోడ్డు వేస్తున్నారు. ప్రభుత్వ భూముల్లోని గనుల్లో ఉన్న వ్యర్థాలను ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తూ గుత్తేదారు నాణ్యతకు తిలోదకాలుస్తున్నాడని గ్రామస్తులు మండిపడుతున్నారు. మరోవైపు ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారు ఇష్టారాజ్యంగా రోడ్డు పనులు చేస్తున్నారని అంటున్నారు. ఇదేవిషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రావణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా మొరంతోనే రోడ్డు వేయాలని అన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీరస్తు.. శుభమస్తు.. ఆదాయ‘మస్తు’

ఆర్టీసీకి కల్యాణ కాంతులు
- శుభముహూర్తాలతో బస్సుల్లో పెరిగిన ప్రయాణాలు
- కిటకిటలాడుతున్న ప్రయాణ ప్రాంగణాలు
- రోజుకు రూ.లక్షల్లో డిపోలకు ఆదాయం
- లాభాల్లో షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్ డిపోలు

షాద్‌నగర్: శ్రీరస్తు.. శుభమస్తు.. కల్యాణమస్తు.. అంటూ పెద్దలు వధూవరులను దీవిస్తుండగా.. ప్రయాణికులు ఆదాయ‘మస్తు’ అంటూ ఆర్టీసీని ఆదరిస్తున్నారు. పెళ్లిళ్లు, శుభకార్యాలతో బంధుగణం ఆర్టీసీకి అదనపు ఆదాయం సమకూర్చిపెడుతోంది. శుభ ముహూర్తాల నేపథ్యంలో ప్రయాణ ప్రాంగణాలు రద్దీగా మారుతున్నాయి. దీంతో జిల్లాలో ఉన్న పలు డిపోలు లాభాలబాట పట్టాయి. తాజా పరిస్థితుల్లో ఆర్టీసీ ఆదాయం కోసం కొట్టుమిట్టాడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సంస్థ రాబడి మార్గం అన్వేషించింది. ఇప్పటికే ప్రయాణికులతో ఏవిధంగా మర్యాదగా మెలిగి ఆదాయం పెంచుకోవాలన్న దానిపై కండక్టర్లకు శిక్షణ ఇచ్చారు. అదేవిధంగా పెళ్లిళ్లకు బస్సులను అద్దెకివ్వడం, ప్రయాణికులు చెయ్యి ఎత్తిన చోట బస్సు ఆపడం, సిబ్బంది ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకోవడం, ప్రయాణ పరమైన రాయితీలు అందివ్వ డం చేస్తోంది. ఇవన్నీ క్రమంగా ఆర్టీసీని రాబడి వైపు నడిపిస్తుండగా దీనికి తాజా వివాహాల సీజన్ కలిసొచ్చింది. జిల్లాలో ఉన్న పలు డిపోలు గత నెల నుంచి ఇప్పటివరకు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. దీంతో సంస్థకు ఆదాయం పెరుగుతోంది.

రోజుకు లక్షల్లో ఆదాయం

షాద్‌నగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్ డిపోలు ప్రస్తుతం లాభాల బాటలో పయనిస్తున్నాయి. వివాహ ముహూర్తాల కారణంగా ఈనెల మొదటి వారం నుంచి డిపోలకు రోజువారీ సగటు ఆదాయం గణనీయంగా పెరిగింది. షాద్‌నగర్ డిపోకు రోజుకు సుమారు రూ.15 లక్షలు, ఇబ్రహీంపట్నం డిపోకు రూ.14లక్షలు, మహేశ్వరం డిపోకు రూ.10లక్షలు, రాజేంద్రనగర్ డిపోకు రూ.18లక్షల ఆదాయం వస్తోంది. ముహూర్తాల కారణంగా రాష్ట్రంలోని 45 డిపోలు లాభాల బాట పట్టగా అందులో మన జిల్లా నుంచి నాలుగు డిపోలు ఉండడం విశేషం.

ఓఆర్ నమోదు ఇలా..

ఆర్టీసీలో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) ఎంత శాతం నమోదు అవుతుందనేది ఎంతో ముఖ్యం. శుభముహూర్తాల కారణంగా షాద్‌నగర్ డిపోలో 83 శాతం, ఇబ్రహీంపట్నం 60 శాతం, మహేశ్వరం 53 శాతం, రాజేంద్రనగర్ 78శాతం ఓఆర్ నమోదు అవుతుంది. గత మార్చి చివరి వారం నుంచి ఏప్రిల్ వరకు తక్కువగా ఉన్న ఓఆర్ మే మొదటి వారం నుంచి గణనీయంగా పెరిగింది.

ఆదాయం వచ్చే మార్గాల్లోనే..

అవకాశం ఉన్నప్పుడే ఆదాయం సాధించాలనే చందంగా ఆర్టీసీ అధికారులు వ్యవహరిస్తున్నారు. ప్రయాణికులు అధికంగా ప్రయాణించే మార్గాలను గుర్తించి ఆ రూట్లలోనే బస్సులను నడిపిస్తున్నారు. సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టారు.

పాపం పసికందు

రోడ్డు పక్కన శిశువును వదిలి వెళ్లిన తల్లి


ఐసీడీఎస్ అధికారుల చెంత మగ శిశువు

షాద్‌నగర్: రెండు రోజుల క్రితం పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన తల్లి రోడ్డు పక్కన వదిలేసి వెళ్లింది.. ఈ సంఘటన ఫరూఖ్‌నగర్ మండలం విఠ్యాల గ్రామ శివారులో మంగళవారం మధ్యాహ్నం వెలుగు చూసింది. అయితే వేడి గాలులకు తట్టుకోలేని ఆ శిశువు రోధించడం మొదలు పెట్టింది. దీంతో అటుగా వెళుతున్న మహిళలు శిశువు అక్కున చేర్చుకొని పాలు తాపారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. శిశువులను ఐసీడీఎస్ అధికారులకు అప్పగించడంతో వారు శిశువిహార్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్వలాభం కోసమే పాలమూరు డిజైన్ మార్పు

మాజీ మంత్రి చిన్నారెడ్డి

కొందుర్గు: ముఖ్యమంత్రి కేసీఆర్ నల్లగొండలోని తన స్నేహితుల స్వలాభం కోసమే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు డిజైన్ మార్చారని మాజీ మంత్రి చిన్నారెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ. 38 వేల కోట్లతో పరిపాలన అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు సంబంధించి 4 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వడం కోసం జూరాల నుంచి నీటిని తరలించేలా డిజైన్ చేయడం జరిగిందన్నారు. రీడిజైన్ పేరుతో సీఎం కేసీఆర్ పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు తీరని అన్యాయం చేశాడని విమర్శించారు. 2015లో ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి భూమిపూజ చేశారని ఇప్పటివరకు కేవలం నార్లాపూర్, ఏదుల, కర్వేన, వట్టెం, ఉద్ధండాపూర్ వరకు మాత్రమే కాల్వలు తవ్వారన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ఊసేలేదన్నారు. సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్, పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు జితేందర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, మల్లేష్ గౌడ్, కృష్ణా రెడ్డి, వజ్రమ్మ పాల్గొన్నారు.

కర్ణాటక ఫలితాలు పునరావృతం

భట్టి పాదయాత్రలో పాల్గొనడానికి వచ్చిన ములుగు ఎమ్మెల్యే సీతక్క విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌పై నమ్మకంతో కర్ణాటకలో ప్రజలు గెలిపించారని, ఈ ఫలితాలు తెలంగాణలో పునరావృతం కావడం ఖాయమన్నారు. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా కేసీఆర్ పాలన ఉందని, ప్రజల ప్రభుత్వం కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు.